సాక్షి తిరుపతి

సోమవారం । 9 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,060
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	16
చిత్తూరు	29	15
తిరుమల	24	12
గూడూరు	29	18
నగరి	30	17

భక్తిసాగరంలో మునగంగ



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించి తరించారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం తప్పనిసరిగా ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని సూచించారు.

సౌకర్యవంతంగా విద్యుత్ బస్సు ప్రయాణం



ఆర్టీసీ విద్యుత్ బస్సులో ప్రయాణిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుమల: ఆర్టీసీ నడుపుతున్న కాలుష్య రహిత విద్యుత్ బస్సులో ప్రయాణం సౌకర్యవంతంగా ఉందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కాలినడకన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ విద్యుత్ బస్సులో ప్రయాణించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి కాలినడకన వెళ్లి తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి తిరుపతి వరకు విద్యుత్ బస్సులో ప్రయాణించామని సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం జిల్లాకు దాదాపు 100 విద్యుత్ బస్సులను కేటాయించిందని తెలిపారు. వాటిలో 50 బస్సులను తిరుపతి – తిరుమల, మరో 14 రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు, 12 బస్సులను తిరుపతి నుంచి మదనపల్లి, కడప నెల్లూరు ప్రాంతాలకు నడపనున్నట్టు తెలిపారు. విద్యుత్ బస్సుల నిర్వహణ కోసం ఐదెకరాల భూమి కేటాయించనున్నట్టు తెలిపారు. ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి, సీటీఎం భాస్కర్‌రెడ్డి, బస్సుల నిర్వహణ సిబ్బంది వీరబాబు, మహేష్, డ్రైవర్ మురళిని కలెక్టర్ అభినందించారు.

ప్రశాంత వాతావరణంలో గ్రూప్-1 ప్రిలిమ్స్



స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రశ్న పత్రాలను తరలిస్తున్న కస్టోడియన్, ఆర్డీఓ కనకనరసారెడ్డి

తిరుపతి అర్బన్: గ్రూప్–1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగినట్టు జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి కేంద్రంగా 14 కేంద్రాల్లో రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షలకు 7,915 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా ఉదయం సెషన్‌లో 5,522 మంది (69.77 శాతం), మధ్యాహ్నం సెషన్‌లో 5,510 మంది (69.61 శాతం) హాజరయ్యారని వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగలేదన్నారు. ఆర్డీఓ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రశ్న పత్రాలను పక డ్బందీగా తరలించినట్టు తెలిపారు. పరీక్షల కోఆర్డినేటర్‌గా రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, కస్టోడియన్‌గా ఆర్డీఓ కనక నరసారెడ్డి, లైజన్, ఏపీపీఎస్‌సీ అధికారులు, పోలీస్ శాఖ సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

డ్రిప్.. గ్రిప్!

వ్యవసాయ విప్లవానికి ప్రభుత్వం తెరతీసింది.. అన్నదాతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది.. పెట్టుబడి నిధి కింద 'భరోసా' కల్పిస్తోంది. ఆర్‌బీకేలతో క్షేత్రస్థాయిలో సాయం అందిస్తోంది.. ఈ క్రమంలోనే సేద్యం సులభతరం చేసేందుకు బిందు పరికరాలను సమకూరుస్తోంది.. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు సహకరిస్తోంది. డ్రిప్ పరికరాలను సైతం రాయితీపై పంపిణీ చేస్తోంది. ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం వరకు సబ్సిడీ ఇస్తూ ప్రోత్సహిస్తోంది.

- బిందు సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- 70 నుంచి 90శాతం సబ్సిడీపై పరికరాలు
- సన్న, చిన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యం

గూడూరు : చిల్లకూరులో స్ప్రింక్లర్ల ద్వారా వేరుశనగ సాగు



నగరి మండలం కాకవేడులో వేరుశనగకు లేటల్ పైపుల ద్వారా నీటి సరఫరా



పుత్తూరు రూరల్ : వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోంది. వినూత్న విధానాల్లో సాగు చేపట్టేలా రైతులకు ఆధునిక పరికరాలు పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. డ్రిప్ పరికరాలను 70 నుంచి 90 శాతం రాయితీతో రైతులకు అందజేస్తోంది. తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించే ప్రక్రియపై ఉద్యానశాఖ అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమలో చిత్తూరు జిల్లాలో సుమారు 9,800 హెక్టార్లలో బిందు సేద్యం చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం రూ.68 కోట్లు రాయితీపై పరికరాలు అందజేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం 2,950 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ కోసం రూ.21 కోట్లు వెచ్చించారు. తిరుపతి జిల్లాలో 4,800 హెక్టార్లలో రూ.46.24 కోట్లు రాయితీపై డ్రిప్ పరికరాలు అందించేలా లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.5.51 కోట్లు ఖర్చు పెట్టారు. మార్చి నాటికి రెండు జిల్లాల్లో లక్ష్యం అధిగమించే దిశగా అడుగులు వేస్తున్నారు.



డ్రిప్ వినియోగంపై రైతుకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనువైన పంటలు.. ప్రయోజనాలు

మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయలు, మిరప, చెరుకు, స్ప్రింక్లర్ల ద్వారా వేరుశనగ, మినుము సాగు చేయవచ్చు. బిందు– స్ప్రింక్లర్ల సేద్యంతో నీటిని పొదుపు చేయవచ్చు. విద్యుత్ ఆదా చేయవచ్చు. పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. కలుపు బెడద ఉండదు. మొక్క పెరుగుదల ఆశాజనకంగా ఉంటుంది. పంట దిగుబడి పెరుగుతుంది.

బిందు సేద్యం పరికరాలకు రాయితీలు ఇలా..

- ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు పొందవచ్చు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.2.18 లక్షల వరకు రాయితీ వస్తుంది.
- ఐదు నుంచి పదెకరాల భూమి గల రైతులు 70 శాతం రాయితీతో బిందు పరికరాలు తీసుకోవచ్చు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.3.46 లక్షల వరకు రాయితీ కలుగుతుంది.

తుంపర్ల సేద్యం (స్ప్రింక్లర్లు)పై రాయితీ ఇలా..

- సన్న, చిన్నకారు రైతులు స్ప్రింక్లర్ పరికరాలను 55 శాతం రాయితీపై పొందవచ్చు.
- ఐదు నుంచి పదెకరాల రైతులు 45 శాతం రాయితీపై పరికరాలు తీసుకోవచ్చు.
- రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు 7 ఏళ్ల తర్వాత రెండో పర్యాయం సబ్సిడీపై పరికరాలు పొందే వెసులుబాటు కల్పించారు.

దరఖాస్తు చేసుకునే విధానం

- డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను రాయితీపై పొందేందుకు ఆధార్ కార్డు, తహసీల్దార్ ధ్రువీకరించిన భూమి యాజమాన్య పత్రం లేదా 1బీ రికార్డుతో రైతు భరోసా (ఆర్‌బీకే) కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులో తప్పనిసరిగా రైతు తన సెల్‌ఫోన్ నంబర్‌ను నమోదు చేసుకోవాలి. సబ్సిడీ, నాన్ సబ్సిడీ వివరాలను నేరుగా రైతు ఫోన్‌కే మెసేజ్ ద్వారా తెలియజేస్తారు.
- వెబ్ ల్యాండ్ పోర్టల్‌లో చేర్చిన పొలం విస్తీర్ణం ఆధారంగా సబ్సిడీ అర్హత నిర్ణయిస్తారు.
- తిరుపతి జిల్లాకు చెందిన రైతులు కట్టవలసిన నాన్ సబ్సిడీ మొత్తాన్ని ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, తిరుపతి పేరు మీద అకౌంట్ నంబరు 922010035414746, యాక్సిస్ బ్యాంకు, తిరుపతి అకౌంట్‌కు నేరుగా లేదా గూగుల్‌పే, ఫోన్ పే ద్వారా జమ చేయవచ్చు.
- చిత్తూరు జిల్లాకు చెందిన రైతులు కట్టవలసిన నాన్ సబ్సిడీ మొత్తాన్ని ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, చిత్తూరు పేరు మీద అకౌంట్ నంబరు 917010069151020కు నేరుగా లేదా గూగుల్, ఫోన్ పే ద్వారా చెల్లించవచ్చు.

ఎరువులు సైతం డ్రిప్ ద్వారానే..



బిందు సేద్యంలో ఎరువులను సైతం డ్రిప్ ద్వారా అందించవచ్చు. దీంతో పంట దిగుబడి పెరిగి రైతుకు లాభదాయకంగా ఉంటుంది. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా అన్ని సౌకర్యాలను కలిసిస్తూ, భారీ రాయితీలను ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. **– జి.సతీష్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, తిరుపతి**

నీరు ఆదా



నాలుగు ఎకరాల్లో బిందు సేద్యం విధానంలో చెరుకు సాగుచేస్తున్నా. ఈ పద్ధతిలో నీరు మొక్కల మొదళ్లకే అందుతుంది. పంట వరుసల మధ్యలో తేమ ఉండదు. కాబట్టి నీరు ఆదా అవడంతో పాటు కలుపు సమస్య చాలా వరకు తగ్గింది. మందుల పిచికారీ, పంట కోత వంటివి సులువుగా చేయడానికి వీలవుతోంది. **– రమేష్, బుగ్గ అగ్రహారం, నగరి మండలం**

రైతులే కంపెనీని ఎంచుకోవచ్చు



"ఆర్‌బీకేల ద్వారా రైతులే తమకు ఏ కంపెనీ డ్రిప్ పరికరాలు కావాలో ఎంచుకోవచ్చు. వారు ఎంపిక చేసుకున్న కంపెనీతోనే డ్రిప్ ఇరిగేషన్‌ను ఇన్‌స్టాల్ చేయిస్తున్నాం. ఒక కంపెనీ ఇన్‌స్టాల్ చేయడంలో జాప్యం చేస్తే మరోటి ఎంచుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 13 కంపెనీలకు చెందిన డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల ఏమాత్రం ఆలస్యం లేకుండా దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ సకాలంలో ఇన్‌స్టాల్ చేస్తున్నాం. **– మధుసూదనరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, చిత్తూరు**

బస్టాండ్‌లో మట్టి పరీక్షలు ప్రారంభం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటర్ మోడల్ స్టేషన్(ఐఎంఎస్)గా అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మట్టి పరీక్షలను ప్రారంభించారు. ఈ క్రమంలో నాలుగుచోట్ల 30 అడుగుల లోతు వరకు తవ్వి మట్టి పటుత్వాన్ని అంచనా వేయనున్నారు. ఇప్పటికే రోజుకు బస్టాండ్‌కు ఎన్ని బస్సులు వచ్చిపోతున్నాయి, ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు తదితర విషయాలపై సర్వే పూర్తి చేశారు. త్వరలో తిరుపతి బస్టాండ్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా తిరుపతి నగరంలో అలిపిరి బస్టాండ్, మంగళం డిపో, లక్ష్మీపురం సర్కిల్, అన్నమయ్య సర్కిల్‌తోపాటు రేణిగుంట రోడ్డులో తాత్కాలిక బస్టాండ్ల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

14 నుంచి 17 అంతస్తుల్లో బస్టాండ్

తిరుపతిలో కొత్తగా ఏర్పాటు చేయనున్న బస్టాండ్‌లో 14 నుంచి 17 అంతస్తులతో భవనాన్ని నిర్మించనున్నారు. బస్టాండ్‌లోకి వచ్చిన ప్రయాణికులు అన్ని వస్తువులను అక్కడే కొనుగోలు చేసి తిరుపతి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం 64 ప్లాట్‌ఫాంలు ఉండగా వాటిని 120కి పెంచనున్నారు. రోజూ 1,750 బస్సులు 3,940 ట్రిప్పులు తిరుగుతున్నాయి. 1.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. 178 దుకాణాలున్నాయి. మరుగుదొడ్లు 5, తాగునీటి కొళాయిలు 12, రెండు పార్కింగ్ సెంటర్లు ఉండగా వాటిని నాలుగు రెట్లు పెంచనున్నారు. అంతేకాకుండా చార్జింగ్ పాయింట్లు, మల్టీపర్పస్ థియేటర్లను ఏర్పాటు చేయనున్నారు.



బస్టాండ్‌లో 30 అడుగుల లోతు వరకు బోరు వేస్తున్న సిబ్బంది

అయ్యప్ప సేవకు మంత్రి పెద్దిరెడ్డి



కాలినడకన శబరిమలై వెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు/పుంగనూరు/ సదుం/ చిత్తూరు కార్పొరేషన్ : శబరిమలైలో అయ్యప్పస్వామి దర్శనానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం తరలివెళ్లారు. 40 రోజులుగా కఠిన దీక్ష పాటించిన ఆయన అయ్యప్ప సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ ఉన్నారు.

కోడెగిత్తల జోరు.. యువత హుషారు



ఉరకలేస్తున్న కోడెగిత్త

రామచంద్రాపురం మండలం నూతిగుంటపల్లిలో ఆదివారం పరుష పందాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పశువుల కొమ్ములకు రంగులు పూసి ముస్తాబు చేశారు. కొయ్యతో చెక్కిన పలకలు, రంగు కాగితాలు, వివిధ రకాల దేవుళ్ల బొమ్మలను అతికించి, డప్పులు కొట్టి పశువులను జనంలోకి వదిలారు. యువకులు వాటిని నిలువరించి కొమ్ములకు ఉన్న బహుమతులను సొంతం చేసుకోవడానికి పోటీ పడ్డారు. కొంతమంది పశువుల యజమానులు తమకు నచ్చిన నాయకుల చిత్రాలు, దేవుళ్ల బొమ్మలను పలకలకు అతికించారు. ప్రజలకు స్థానికులు అన్నదానం చేశారు. – రామచంద్రాపురం





కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు

ప్రజల రక్షణ కోసమే జీఓ నం.1

- దీనిపై రాద్ధాంతం చేయడం విడ్డూరం
- మంత్రి ఆర్కే రోజా ధ్వజం



నగరి: ప్రజల రక్షణ కోసమే ప్రభుత్వం జీఓ నం.1 తెచ్చిందని, దీనిపై కొందరు నేతలతోపాటు మీడియా సంస్థలు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ధ్వజమెత్తారు. ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాల సభలను నిషేధించడానికే జీఓ నం.1 తెచ్చారంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, జీఓలో ఏముందో తెలుసుకోకుండానే నోటికొచ్చినట్టు మాట్లాడడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం ప్రజల భద్రత కోసం ప్రత్యామ్నాయ మార్గాలు సూచిస్తూ మార్గదర్శకాలు జారీచేసిందని గుర్తుచేశారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై సభల నిర్వహణతో ప్రజలకు ఇబ్బందులు ఉంటాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేని పబ్లిక్ గ్రౌండ్స్, ప్రత్యామ్నాయ ప్రైవేటు స్థలాల్లో సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలని సూచనలు చేసిందని పేర్కొన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో లిఖిత పూర్వకంగా కారణాలు తెలియజేసే దరఖాస్తులు పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చిందని స్పష్టం చేశారు. మున్సిపల్, పంచాయతీ రోడ్లు మరింత ఇరుకుగా ఉన్నందున గతంలో సభలలో మరణాలు సంభవించాయని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు, మీటింగ్ సమయం, స్థలం, ఎగ్జిట్ పాయింట్స్, హాజరయ్యే జనాభా సంఖ్య ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని, సభలు పెట్టే వారికి పోలీసులు ప్రత్యామ్నాయ ప్రదేశాలు సూచించాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇంతస్పష్టంగా ప్రభుత్వం మార్గదర్శకాలిచ్చినా దుష్టచతుష్టయం సభలు, ర్యాలీలు మొత్తం నిషేధించేశారంటూ దుష్ప్రచారం చేయడం భావ్యం కాదని ఆ ప్రకటనలో హితవు పలికారు.

పకడ్బందీగా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : సైనిక్ స్కూల్లో 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో పరీక్షలను ఆదివారం పకడ్బందీగా నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి తిరుపతి కేంద్రంగా లిటిల్ ఏంజెల్స్, గీతం, శ్లోక బిర్లా, ఎస్వీసీఈ, ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల మొత్తం 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. 6వ తరగతి ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు, 9వ తరగతికి 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 2,127 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 147 మంది గైర్హాజరైనట్లు పరీక్షల కో–ఆర్డినేటర్ సింధు తెలిపారు.

కండలేరు మట్టి కట్టపై గేట్లు ఏర్పాటు



కండలేరు డ్యామ్ మట్టి కట్ట వద్ద ఏర్పాటు చేసిన గేట్లు

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయం మట్టి కట్టపై వాహనాలు రాకపోకలు సాగించకుండా అధికారులు గేట్లు ఏర్పాటు చేశారు. కండలేరు జలాశయం మట్టి కట్ట 11 కిలోమీటర్లు ఉంది. దీని పైకి వెళ్లేందుకు నాలుగు ర్యాంపులున్నాయి. సందర్శకులు మట్టి కట్టపైకి వెళ్లడం, నీరు ఉన్న ప్రదేశాలకు వెళ్లి ఈత కొట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో నీటిలో మునిగి చనిపోయారు. ఈ నేపథ్యంలో మట్టి కట్టపైకి వెళ్లకుండా ఉండేందుకు రెండు వైపులా రెండు గేట్లు, నాలుగు ర్యాంపుల వద్ద నాలుగు గేట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సందర్శకులు కాలినడకన వెళ్లవచ్చని వివరించారు.

మహిళలకు ఆర్యావర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ నిరుద్యోగ యువతులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా ఆర్యావర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ అభివృద్ధి శిక్షణ సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 16 నుంచి 30 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెంది 19 నుంచి 40 ఏళ్లలోపు ఉండి, 10వ తరగతి చదువుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనంతో పాటు రాను–పోను ఒక్కసారి ఛార్జీలు ఇస్తామని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇస్తామని, ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్క బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని తీసుకుంటామని తెలిపారు. ముందుగా పేరు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివద్ధి సంస్థ, ద్వారక నగర్, కొత్తపేట, చంద్రగిరితోపాటు 79896 80587, 63017 17672 94949 51289లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల బాసట

- కలసికట్టుగా పనిచేసి విజయకేతనం ఎగురవేస్తాం
- మతిభ్రమించడంతోనే చంద్రబాబు విమర్శలు
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని



మాట్లాడుతున్న రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు బాసటగా నిలుస్తున్నారని, అందరం కలసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీని తిరిగి గెలిపించుకుందామని ఆ పార్టీ తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. నాయుడు పేట కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధ్యక్షతన సూళ్లూరుపేట నియోజవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలినేని మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 95 శాతానికి పైగా నెరవేర్చిన సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. మరెన్నో వినూత్న పథకాలను అమలుచేస్తున్నారని వివరించారు. అధికారంలో ఉన్నా ఆశించినవి జరగడం లేదని నిరాశ చెందొద్దని, అభివృద్ధి పనులు, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పార్టీ శ్రేణులకు సూచించారు. వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి



వైఎస్సార్ ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలినేని, నాయకులు

వస్తున్న ఆదరణను చూసి చంద్రబాబుకు మతిభ్రమించిందని, అందువల్లే సీఎంపై అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

చరిత్రను తిరగారాసేలా మెజారిటీ సాధించాలి

వచ్చే ఎన్నికల్లో తిరుపతి జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు రాష్ట్ర చరిత్రను తిరగరాసేలా మెజారిటీ సాధించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదరుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మాజీ సీఎం, తన తండ్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తూ సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరితో పాటు మరో నాలుగు నియోజవర్గాలను కలుపుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లాను ఏర్పాటు చేశారని తెలిపారు. ఎన్నికల్లో పార్టీని గెలిపించి సీఎం రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలను తొలగిస్తున్నట్లు ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైనాన్ని తిప్పికొట్టాలని సూచించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో పనిచేస్తున్న సీఎంకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎన్‌డీసీసీబీ నెల్లూరు జిల్లా చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు బాలచంద్రరెడ్డి, సూళ్లూరుపేట నియోజవర్గ పరిశీలకులు పాశం సుధీర్‌కుమార్ రెడ్డి, ఆరు మండలాలకు చెందిన పార్టీ మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సోషల్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



విహంగాలను వీక్షించేందుకు విచ్చేస్తున్న సందర్శకులు

పక్షుల కేంద్రంలో సందర్శకుల సందడి



విడిది చేసిన గూడబాతులు

దొరవారిసత్రం : మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. అక్కడ విడిది చేసే విదేశీ వలస విహంగాలను వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలలు నుంచే కాకండా బయటి రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పక్షులతో పాటు జింకల పార్కు, చిలుకలను సందర్శించారు. ఇదిలా ఉండగా పక్షుల కేంద్రంలో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పిల్లల పార్కులో జారుడు బల్ల, రంగుల రాట్నం తదితర ఆట వస్తువులు దెబ్బతిన్నాయని సందర్శకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చిన్నారులకు ప్రమాదాలు జరగకముందే ఆట వస్తువులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని తల్లి, కొడుకు దుర్మరణం

– త్రుటిలో తప్పించుకున్న తండ్రి



మీనా, చందు మృతదేహాలు



ప్రమాదానికి కారణమైన టిప్పర్

తిరుపతి రూరల్: అమ్మా లారీ వేగంగా వస్తోంది.. నాకు భయమేస్తోంది.. అంటూ చిన్నారి ఆర్తనాదాలు లారీ చక్రాల కింద నలిగిపోయాయి.. కళ్లెదుటే లారీ చక్రాల కింద పడి నలిగిపోతున్న అర్ధాంగి, కన్నబిడ్డను చూసి అతను తల్లిడిల్లిపోయాడు. ఏమి చేసేదిరా దేవుడా అంటూ అతను చేస్తున్న రోదనలను చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో తల్లి, కుమారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం గాంధీపురం పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎంఆర్‌పల్లి సీఐ సురేంద్రారెడ్డి కథనం మేరకు.. తుమ్మలగుంటకు చెందిన రుద్రయ్య గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. ఆయన చిన్న కుమారుడు చందు(2)కు జ్వరంగా ఉండడంతో ఆదివారం ఉదయం భార్య మీనాతో కలిసి ద్విచక్ర వాహనంలో తిరుపతి ఆస్పత్రికి బయలుదేరాడు. తుమ్మలగుంట నుంచి పద్మావతి మహిళా యూనివర్సిటీ సమీపంలో మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. రుద్రయ్య కుడివైపునకు పడిపోగా మీనా, చందు ఎడమవైపు రోడ్డుపై పడ్డారు. వారి మీదుగా టిప్పరు వెనుక చక్రాలు ఎక్కడంతో తలలు, శరీరాలు ఛిద్రమయ్యాయి.

కన్నీరు మున్నీరైన రుద్రయ్య

కళ్లెదుటే భార్య, కొడుకు దుర్మరణం చెందడంతో రుద్రయ్య, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణాలు పోయాయని వాపోయారు. ఆగ్రహంతో ఆందోళన చేపట్టారు. ఎంఆర్‌పల్లి సీఐ సురేంద్రారెడ్డి, పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి టిప్పర్ డ్రైవర్ మల్లికార్జునను అరెస్ట్ చేశారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన



మాట్లాడుతున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

చిట్టమూరు: తీర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తానని ప్రకాశం, నెల్లూరు. చిత్తూరు జిల్లాల పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కొత్తగుంట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శాసన మండలిలో ఒక్క యూనియన్ మాత్రమే 30 ఏళ్లుగా ఉన్నా ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. తాము ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించామన్నారు. 36 నియోజకవర్గాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తనను ఎమ్మెల్సీగా ఆదరిస్తే తీర ప్రాంత అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు కామిరెడ్డి కస్తూర్ రెడ్డి, జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, మల్లాం ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చిల్లకూరు కోదండరామిరెడ్డి, రాజారెడ్డి, షేక్ మస్తాన్ సాహెబ్, గొట్టికాటి రవీంద్రరెడ్డి, టీఏమ్మార్ విద్యా సంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, విజయులురెడ్డి, రమేష్ రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆశ మధు పాల్గొన్నారు,



వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



రామానూజపల్లి నాగరాజు, ప్రసాద్

తిరుపతి రూరల్/ రామచంద్రాపురం: ఏపీ వీఆర్వోల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా రామానూజపల్లి నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కరణం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతి రూరల్ మండలంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా చిత్తూరు జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు బాలాజీరెడ్డి, సహ ఎన్నికల అధికారిగా అశోక్‌రెడ్డి వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా మురళీకృష్ణ, కోశాధికారిగా భాస్కరయ్య, డిప్యూటీ అధ్యక్షుడిగా ప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, మనోజ్‌కుమార్, కిరణ్‌కుమార్, నల్లయ్య, చంద్రకళ, మరో 17 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీఆర్వోల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, కార్యదర్శి అప్పలనాయుడు, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి గాయాలు

బైరెడ్డిపల్లె : కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకునే యత్నంలో ఎస్‌ఐ వెంకటనరసింహులు గాయపడ్డారు. శనివారం రాత్రి ఓ వ్యక్తి బైక్‌పై మద్యం తీసుకువస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ అక్కడికి చేరుకుని అడ్డుకోబోయిన క్రమంలో ఎస్‌ఐ చేతికి గాయమైంది.

15 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని పేకాట స్థావరాలపై ఆదివారం వన్‌టౌన్ పోలీసుల దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న 15 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.36 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామని సీఐ నరసింహరాజు తెలిపారు.

ఆరుగురు కోడి పందెం రాయుళ్లు..

సైదాపురం: మండలంలోని తోకలపూడి గ్రామ శివారులో ఆదివారం కోడి పందెం స్థావరాలపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు. వారి నుంచి రూ.3160, మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

తమిళనాడు బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం, వాహనాలతో అధికారులు

కుప్పం : తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని వేర్వేరు చోట్ల విజిలెన్స్ సీఐ వెంకటరవి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయకుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. కుప్పం పురపాలక పరిధిలోని విజలాపురం సర్కిల్ వద్ద మినీ టెంపోలో రవాణా చేస్తున్న 4 టన్నుల తమిళనాడు చౌక బియ్యాన్ని సీజ్ చేసి తిరుపత్తూరు చెందిన డ్రైవర్ శక్తివేలును అదుపులోకి తీసుకున్నారు. అలాగే పట్టణంలోని ఏరియా వైద్యశాల వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో 3 టన్నుల తమిళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శాంతిపురానికి చెందిన డ్రైవర్ గోపీని అరెస్ట్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: మంగళంలో ఆదివారం మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్‌ఐ నరసింహారావు కథనం మేరకు.. మంగళంలో ఉంటున్న రవి (50) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై సంపాదనను ఇంట్లో ఇవ్వకపోవడంతో భార్య నీలా గొడవ పడేది. ఈ నేపథ్యంలో ఆదివారం అతను పూటుగా మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

పేలుడు సామగ్రి పట్టివేత



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడుపల్లె : తమిళనాడు నుంచి అక్రమంగా తీసుకువస్తున్న పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ కథనం మేరకు.. పలమనేరు మార్గంలోని గణేష్ పురం వద్ద ఆదివారం ఉదయం గుడుపల్లె పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో తిరువణ్ణామలై నుంచి వస్తున్న కారులో పేలుడు పదార్థాలను గుర్తించారు. కృష్ణగిరికి చెందిన డ్రైవర్ అబ్దుల్ లతీఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారులోని రూ.50 వేల విలువైన జిలిటెన్ స్టిక్స్, 400 ఎలక్ట్రానిక్ డిటొనేటర్లు, 2 కట్టల వైర్లను సీజ్ చేశారు.తనిఖీల్లో ఏఎస్‌ఐ మోహన్, సిబ్బంది వేణు, రత్నప్ప, వెంకటాచలం, అరుణాచలం, నటరాజన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



పాకాల : మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ కొండకిందపల్లి సమీపంలో మామిడి తోటలో ఆదివారం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. కొండకిందపల్లికి ఆనుకుని ఉన్న మామిడి తోటలో జింక ఉండడాన్ని కుక్కలు గమనించి దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన జింక మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

